# యాకోబు వ్రాసిన పత్రిక 3వ అధ్యాయము

### నాలుకను స్వాధీన మందుంచుకొనుట

నా సహోదరులారా, బోధకులమైన మనము మరి కఠినమైన తీర్పు పొందుదు మని తెలిసికొని మీలో అనేకులు బోధకులు కాకుండుడు 2 అనేక విషయములలో మన మందరము తప్పిపోవుచున్నాము, ఎవడైనను మాటయందు తప్పని యెడల అట్టివాడు లోపము లేనివాడై, తన సర్వశరీరమును స్వాధీన మందుంచుకొన శక్తిగల వాడగును. 3 గుఱ్ఱములు మనకు లోబడుటకై నోటికి కళ్లెము పెట్టి, వాటిశరీరమంతయు త్రిప్పుదుముగదా? 4 ఓడలను కూడ చూడుడు అవి ఎంతో గొప్పవై పెనుగాలికి కొట్టుకొని పోబడునవైనను, ఓడ నడుపువాని ఉద్దేశముచొప్పున మిక్కిలి చిన్నదగు చుక్కాని చేత త్రిప్పబడును. 5 ఆలాగుననే నాలుక కూడ చిన్న అవయవమైనను బహుగా అదిరి పడును. ఎంత కొంచెము నిప్పు ఎంత విస్తారమైన అడవిని తగులబెట్టును? 6 నాలుక అగ్నియే, నాలుక మన అవయవములలో ఉంచబడిన పాపప్రపంచమై సర్వశరీరమునకు మాలిన్యము కలుగజేయుచు, ప్రకృతి చక్రమునకు చిచ్చుపెట్టును అది నరకము చేత చిచ్చు పెట్టబడును. 7 మృగ పక్షి సర్ప జలచరములలో ప్రతి జాతియు నరజాతి చేత సాధుకాజాలును, సాధు ఆయెను గాని 8 ఏ నరుడును నాలుకను సాధుచేయనేరడు, అది మరణకరమైన విషముతో నిండినది, అది నిరర్గళమైన దుష్టత్వమే. 9 దీనితో తండ్రియైన ప్రభువును స్తుతింతుము, దీనితోనే దేవుని పోలికెగా పుట్టిన మనుష్యులను శపింతుము. 10 ఒక్కనోట నుండియే ఆశీర్వచనమును శాపవచనమును బయలు వెళ్లును నా సహోదరులారా, ఈలాగుండ కూడదు. 11 నీటిబుగ్గలో ఒక్క జాలునుండియే తియ్యని నీరును చేదునీరును ఊరునా? 12 నా సహోదరులారా, అంజూరపు చెట్టున ఒలీవ పండ్లయినను, ద్రాక్షతీగెను అంజూరపు పండ్లయినను కాయునా? అటువలెనే ఉప్పునీళ్లలో నుండి తియ్యని నీళ్లను ఊరవు.

### దయ్యముల జ్ఞానము - దైవజ్ఞానము

13 మీలో జ్ఞాన వివేకములు గలవాడెవడు? వాడు జ్ఞానముతో కూడిన సాత్వికము గలవాడై, తన యోగ్య ప్రవర్తన వలన తన క్రియలను కనుపరచ వలెను. 14 అయితే మీ హృదయములలో సహింపనలవికాని మత్సరమును వివాదమును ఉంచుకొనిన వారైతే అతిశయపడవద్దు, సత్యమునకు విరోధముగా అబద్ధమాడవద్దు. 15 ఈ జ్ఞానముపై నుండిదిగివచ్చునది కాక భూసంబంధమైనదియు ప్రకృతి సంబంధమైనదియు దయ్యముల జ్ఞానము వంటిదియునై యున్నది. 16 ఏలయనగా, మత్సరమును వివాదమును ఎక్కడ ఉండునో అక్కడ అల్లరియు ప్రతి నీచ కార్యమును ఉండును. 17 అయితే పైనుండివచ్చు జ్ఞానము మొట్టమొదట పవిత్రమైనది, తరువాత సమాధానకరమైనది, మృదువైనది, సులభముగా లోబడునది, కనికరముతోను మంచి ఫలములతోను నిండుకొనినది, పక్షపాతమైనను వేషధారణయైనను లేనిదియునై యున్నది. 18 నీతిఫలము సమాధానము చేయువారికి సమాధానమందు విత్తబడును.